సురక్ష.. పేదలకు శ్రీరామరక్ష

సంక్షేమ పథకాలు అమలు.. సమస్యల పరిష్కారమే లక్ష్యం..అర్హులై ఉండి ఏ ఒక్కరూ లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదన్న తపన.. ఏ ఇంట్లో చిన్న సమస్య ఉన్నా దాన్ని పరిష్కరించాలన్న చిత్తశుద్ధితో ప్రారంభించన కార్యక్రమమే జగనన్న సురక్ష.. ఇది పేదలకు శ్రీరామరక్ష అయ్యింది.

- ప్రజల ముంగిటకే ధ్రువపత్రాలు
- 11 రకాల పత్రాలు ఉచితంగా జారీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- ప్రజా సమస్యల పరిష్కారంలో విప్లవం


డక్కిలి: డీ.వడ్డిపల్లెలో ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న లబ్ధిదారు (ఫైల్)

నాయుడుపేట/డక్కిలి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం నిరుపేద ప్రజలకు శ్రీరామరక్షగా నిలుస్తోంది. సంక్షేమ పథకాలు అందని అర్హులైన పేదలను గుర్తించి, వారికి తక్షణమే అందించేన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. వలంటీర్లు, గృహసారథులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సమస్యలను గుర్తించి, పరిష్కారానికి కృషి చేస్తున్నారు. గతంలో కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డులో మార్పులు, మొబైల్ నంబర్‌తో అనుసంధానం తదితర సేవలు పొందాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. ఆయా ధ్రువపత్రాలు కావాలంటే సేవల ఆధారంగా మీసేవా కేంద్రాల్లో రూ.50 నుంచి రూ.500 వరకు చెల్లించి, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 రకాలు ధ్రువ పత్రాలను ఉచితంగా అందింస్తున్నారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

పంపిణీ చేసిన సర్టిఫికెట్ల వివరాలివీ..

మున్సిపాలిటీ/ మండలం పేరు	వచ్చిన దరఖాస్తులు	జారీ చేసిన సర్టిఫికెట్లు
నాయుడుపేట మున్సిపాలిటీ	3,886	3,270
నాయుడుపేట	2,873	2,536
సూళ్లూరుపేట మున్సిపాలిటీ	5,320	4,707
సూళ్లూరుపేట	2,430	2,356
పెళ్లకూరు	5,013	4,513
ఓజిలి	1,770	1,465
తడ	3,776	2,451
దక్కిలి	2,225	1,684
మొత్తం	29,551	24,691

చెప్పిన దాని కన్నా మిన్నగానే చేస్తున్నారు



“ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలతోపాటు చెప్పిన దాని కన్నా మిన్నగానే చేస్తున్నారు. ఎన్నికల హామీల్లో దాదాపు 98 శాతం పూర్తి చేశారు. అంతకు మించి ఇతర సేవలు ప్రజలకు చేరువ చేస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు తక్షణమే అందిస్తున్నారు. మా ప్రభుత్వం ఇచ్చిన మాటాకు కట్టుబడి ఉందనడానికి మేము అందిస్తున్న సేవలే నిదర్శనం.

-కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్యే, సూళ్లూరుపేట

సురక్షలో రేషన్‌కార్డు మంజూరు



రెండేళ్లుగా రేషన్ కార్డు రాక ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వం నుంచి రేషన్ కార్డులేక అవస్థలు పడ్డాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో రేషన్ కార్డు మంజూరైంది. వేరు కాపురం ఉంటున్న నా కుమారుడు వినోద్‌కు కూడా రేషన్ కార్డు మంజూరు చేశారు.

-ఎం రవీంద్రబాబు, రాజగోపాలపురం, నాయుడుపేట మండలం

జగనన్నకు కృతజ్ఞతలు



నేను ఫ్యామిలి మెంబర్ సర్టిఫికెట్ కోసం ఎన్నో ఏళ్లగా కార్యాలయాల చుట్టూ తిరిగినా మంజూరు కాలేదు. వలంటీర్లు సహకారంతో దరఖాస్తు చేసుకోగానే మా గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఫ్యామిలి మెంబర్ సర్టిఫికెట్‌ను ఉచితంగా అందించారు. వైఎస్సార్ సీపీ సర్కారులో న్యాయం జరిగింది. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

-చింతమాను ధనమ్మ, దీవడ్డిపల్లె, దక్కిలి మండలం

ఆనందంగా ఉంది



జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అధికారులు మా ఇంటికి వచ్చి ఏమైనా సర్టిఫికెట్లు అవసరమా అని అడిగారు. నేను కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలని చెప్పాను. వారు నాతో దరఖాస్తు రాయించుకుని వెళ్లి, పైసా ఖర్చు లేకుండా ఇటీవల జరిగిన సురక్ష కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఇది నాకెంతో ఆనందంగా ఉంది.

-తంబిశెట్టి సుబ్బమ్మ, డీ వడ్డిపల్లె, దక్కిలి మండలం

జగనన్న సురక్ష ప్రతిష్ఠాత్మకం



రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. గ్రామాల్లో ముందుగానే వలంటీర్లు ఇంటింటా తిరిగి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుని ఆన్‌లైన్ సమోదు చేస్తే గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి వారికి కావాల్సిన సర్టిఫికెట్లు అందజేస్తున్నాం. ఎవరైనా సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు చేస్తాం.

- టీ ప్రసన్నకుమారి, ఎంపీడీఓ, డక్కిలి

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఏఓ

సైదాపురం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ పురుషోత్తం శివకుమార్ అన్నారు. మండలంలో ఆదివారం లింగసముద్రంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు వంద శాతం సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు, ఇతర ప్రభుత్వసేవలను గుర్తించి ఉచితంగా అందజేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

చిల్లకూరు: మండలంలోని కడివేడులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కోట మండలం విద్యానగర్‌కు చెందిన జగదీష్ తన సహోదరి కమలతో కలసి మోటార్‌బైక్‌పై గూడూరుకు వచ్చి తిరిగి విద్యానగర్‌కు వెళుతున్నారు. ఈ క్రమంలో కడివేడు వద్ద అకస్మాత్తుగా పొలాలలో నుంచి రోడ్డుపై వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొన్నాడు. దీంతో కమల దూరంగా ఎగిరి పడి పోవడంతో జగదీష్‌పై ట్రాక్టర్ చక్రం ఎక్కింది. ఈ ఘటనలో అతడి ఎడమ కాలు దెబ్బంది. స్థానికులు క్షతగాత్రుడిని 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు అతనికి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ప్రజలకు చేరువగా జగనన్న ప్రభుత్వం


మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

వాకాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలకు చేరువగా ఉందని వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వాకాడులో విలేకరులతో మాట్లాడారు. గూడూరు నియోజవర్గంలో నారా లోకేష్ ఇటీవల చేసిన పాదయాత్రలో వాకాడు మండల అభివృద్ధికి సంబంధించి అధికార పార్టీ నాయకులపై చేసిన విమర్శలను ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు. వాకాడు మండలంలో జగనన్న ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిపై లోకేష్‌కు అవగాహన లేకనే ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును ఉన్నది ఉన్నట్లుగా చదివి ప్రజల్లో నవ్వుల పాలయ్యారని అన్నారు. వాకాడు మండలంలోని తీర ప్రాంతంలో ముఖద్వారాల శాశ్వత పూడిక తీత, పర్యాటక కేంద్రాల అభివృద్ధి, ఫిషింగ్ ల్యాండ్స్ తదితర అభివృద్ధి పనులకు విడతల వారీగా రూ.250 కోట్లు మంజూరుకు ఎంపీ గురుమూర్తి కృషి చేశారన్నారు. టీడీపీ హయాంలో మండలంలో ఒక్క అభివృద్ధి పని అయినా చేసి ఉంటే బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు


విశేషాలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరులో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పలు అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో ఉన్న రావి చెట్టు, త్రిశూలం వద్ద మహిళలు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సీ ఇంద్రసేనమ్మ, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, పాలక మండల సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

చురుగ్గా రోడ్డు పనులు


కోట బజారువీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

కోట: గూడూరు నుంచి కోట మీదుగా తూపిలిపాళెం వరకు రూ.19.50 కోట్లతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కోట దళితవాడ నుంచి బజారు వీధిలో గాంధీబొమ్మ సెంటర్ వరకు సిమెంటు రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆర్అండ్‌బీ డీఈఈ అరుణకుమారి, ఏఈ శివయ్య పరిశీలించారు. రోడ్డు నాణ్యతను పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నందున కోట గాంధీబొమ్మ సెంటర్ మీదుగా వాహనాల రాకపోకలను దారి మళ్లించడం జరిగిందన్నారు. ట్రాఫిక్ ఆంక్షలను పాటించి ప్రజలు సహకరించాలని కోరారు.

బైక్ నుంచి పడి ఒకరికి గాయాలు


గాయపడిన వెంకట రమణయ్య

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ఎస్ఎస్ఆర్ కాలనీ సమీపంలో రహదారిపై ఆదివారం బైక్ అదుపు తప్పి పడి పోవడంతో వేమాల వెంకట రమణయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని రాజగోపాలపురం వీధికి చెందిన వెంకట రమణయ్య అతని బైక్‌పై సీఎస్ తేజ సెంటర్ నుంచి వస్తుండగా ఎస్ఎస్ఆర్ కాలనీ వద్ద శునకం ద్విచక్రవాహనానికి అడ్డు రావడంతో అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో గాయపడిన వెంకట రమణయ్యను స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్స చేయించారు.

దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న కేజే ప్రకృతికుమార్

వెంకటగిరి: పట్టణంలోని బొగ్గులమిట్టలోని నిరుపేద చిన్నారులకు స్వామివివేకానంద యువసైన్యం కన్వీనర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతికుమార్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ స్వామివివేకానంద యువసైన్యం ఆధ్వర్యంలో కష్టజీవులు, శ్రమజీవుల చిన్నారుల విద్యాభ్యాసం కోసం తమ వంతుగా చేయూత అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యువసైన్యం సభ్యులు ధనియాల శ్యామ్‌కుమార్, వై పోతులూరు తదితరులు పాల్గొన్నారు

గురుకులాల్లో పారదర్శకంగా ప్రవేశాలు


కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న డీసీఓ జయభారతి

చిల్లకూరు: గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పారదర్శకంగా చేపట్టనున్నట్లు డీసీఓ వీ జయభారతి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో చేరే విద్యార్థులకు ఆదివారం చిల్లకూరులోని గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించారు. తిరుపతి జిల్లాలోని చిల్లకూరు, వాకాడు, కోట, నాయుడుపేటలోని బాలుర గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఐదో తగరతిలో విద్యార్థుల ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసి, నేరుగా దరఖాస్తు చేసుకున్న వారికి మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాచించారు. ఈ క్రమంలో నాలుగు పాఠశాలలో ఖాళీగా ఉన్న 90 సీట్లను భర్తీ చేసినట్లు డీసీఓ తెలిపారు. గురుకుల పాఠశాలలు, కళాశాలలో ప్రవేశాల విషయంలో ఎలాంటి అవకతవకలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. సీట్ల భర్తీ చేసే సమయంలో ఆయా పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లలతో కలసి సమష్టిగా నిర్ణయాలు తీసుకుని ఎంపిక ప్రకియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌లో చిల్లకూరు, కోట, వాకాడు, నాయుడుపేట గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు మీరా సాహెబ్, వెంకటేశ్వర్లు,మల్లికార్జున్ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి


కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు రూరల్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంలో ఆదివారం ఉదయం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ క్షణికావేశంలో తెలిసో తెలియక నేరాలకు పాల్పడి రౌడీషీటర్లుగా ఉన్నవారిలో మార్పు రావాలని, సత్ప్రవర్తన కలిగి మంచి వారుగా మారితే వారిపై రౌడీ షీట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అల్లర్లు, గొడవలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ దశరథరామారావు పాల్గొన్నారు.

పేదల భూముల్లో పెద్ద(ల) వ్యాపారం


టోల్ ప్లాజా సమీపంలో టైల్స్, సిలికా వ్యాపారం నిర్వహిస్తున్న భూమి

చిల్లకూరు: పేదల భూములు ఆక్రమణకు గురయ్యాయి. మండలకేంద్రానికి సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పేదల భూములపై కొన్నిసిన బడాబాబులు, దళితుల భూముల్లో రూ.కోట్లలో వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తూ ఆదాయం పొందుతున్నారు. పేదల నుంచి నామ మాత్రం లీజుల పేరుతో భూములను సొంతం చేసుకున్నారు వివరాల్లోకి వెళితే.. మండలంలోని బూదనం టోల్ ప్లాజాకు కూత వేటు దూరంలో ఉన్న సర్వే నంబర్ 209-6లో 48 సెంట్లు, 210-3లో 1.53 సెంట్లలో కొంత భూమిని గ్రామానికి చెందిన కొంత మంది పేదలకు గత కొన్నేళ్ల క్రితం ప్రభుత్వం పంపిణీ చేసింది. అప్పట్లో లబ్ధిదారులు ఆ భూములను సాగు చేసుకునే వారు. అయితే ఇటీవల భూముల ధరలు విపరీతంగా పెరగడంతో కొంతమంది వ్యాపారుల కన్ను పడింది. అంతే లబ్ధిదారుల నుంచి నామ మాత్రం లీజులకు భూముల తీసుకుని సిలికా, టైల్స్ వ్యాపారం చేపట్టారు. వ్యవసాయం చేసే భూమిని వ్యసాయేతర భూమిగా మార్పు చేసేందుకు ముందస్తుగా అనుమతులు తీసుకుని వ్యాపార కార్యలాలపాలు చేపట్టాల్సి ఉంది. అయినా ఆ విషయం గురించి వ్యాపారులు పట్టించుకోలేదు. దీనిపై స్థానికులు పలుసార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా నోటీసులు జారీ చేస్తున్నామని తాత్సరం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. వ్యాపారులు నుంచి కింద స్థాయి రెవెన్యూ అధికారి నుంచి మండల స్థాయి అధికారి వరకు భారీ స్థాయిలో ముడుపులు చెల్లించారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీంతోనే అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నారు. ఇకనైనా ప్రభుత్వంకు ఆదాయం చేకూర్చేలా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టి వ్యవసాయ భూమిని కన్వర్షన్ చేసుకునేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై చిల్లకూరు తహసీల్దార్ కే. శ్రీనివాసులను వివరణ కోరగా పేదలకు పంపిణీ చేసిన భూమిలో మరొకరు వ్యాపార లావాదేవిలు చేపట్టినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర పనులకు వినియోగించడం తగదన్నారు. దీనిపై వ్యాపారం నిర్వహిస్తున్న వారితో పాటుగా భూమి లబ్ధిదారుడికి నోటీసులు జారీ చేస్తున్నామని చెప్పారు.

5.6 లీటర్ల సారా స్వాధీనం


నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ సీఐ నాగేశ్వరావు

వెంకటగిరి: వెంకటగిరి- తిరుపతి మార్గంలోని వల్లివేడు క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సులో సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, 5.6 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ పి నాగేశ్వరరావు తెలిపారు.
ఎస్ఈబీ సీఐ కథనం మేరకు.. వల్లివేడు క్రాస్‌రోడ్డు వద్ద ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో తనిఖీలు చేశారు. ఆ సమయంలో తిరుపతి నుంచి వెంకటగిరి వస్తున్న ఆర్టీసీ బస్సులో తనిఖీలు చేశారు. ఆ బస్సులో రాపూరు మండలం ఏపూరు గ్రామానికి చెందిన గంగిరెడ్డి వద్ద 5.6 లీటర్ల సారా ఉండగా గుర్తించారు. నిందితుడిని విచారించగా యలమందల గ్రామానికి చెందిన రామచంద్రయ్య వద్ద సారా కొనుగోలు చేసినట్లు చెప్పాడు. ఈ మేరకు అతడిని అరెస్టు చేసి, సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఈబీ సీఐ తెలిపారు.

గీతా మందిరానికి విరాళం

దొరవారిసత్రం: పోలిరెడ్డిపాళెంలోని శ్రీకృష్ణ పరమాత్మ గీతామందిరానికి నెలబల్లి గ్రామానికి చెందిన శ్రీకృష్ణాఫౌండేషన్ సంస్థ సభ్యుడు నెల్లూరు నాగరాజు, సుధ దంపతులు ఆదివారం రూ.10 వేలు విరాళం అందజేశారు. ఈ నగదును మందిరంలోని వివిధ పనులకు వినియోగిస్తామని సుందరయ్యస్వామి తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

వెంకటగిరి: అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్ల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఈనెల 10, 11 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్‌ల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూజిల్లా కమిటీ సభ్యుడు వడ్డిపల్లి చెంగయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వెంకటగిరి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు మంజుల తెలిపారు. బ్యాండ్‌పాళెంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తిరుపతి కలెక్టరేట్ వద్ద సోమ, మంగళ వారాలు నిర్వహించే ధర్నాకు వెంకటగిరి ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఫలసరుకుల పంపిణీ

గూడూరురూరల్ : స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో రోటరీ చేయూత కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు ఫలసరుకులు పంపిణీ చేశారు. క్లబ్ నూతన అధ్యక్షుడు జి.నరసప్ప చేతుల మీదుగా రొటేరియన్ పీడీసీ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి దాతృత్వంతో నిరుపేదలకు ఫలసరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు యల్లసిరి గోపాల్‌రెడ్డి, పాస్ట్ ప్రెసిడెంట్ బండి ధనుంజయరెడ్డి, నాశిన నాగులు, బొమ్మిడి శ్రీనివాసులు, తాళ్లూరు శ్రీనివాసులు, సిద్దారెడ్డి హరినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 20.616 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 20.616 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,850 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 50, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయీస్‌కు120 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

వాకాడు: మండలంలోని వాలమేడులోని చొక్కనాథీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పేద బ్రహ్మణ మహిళలకు ఆర్థిక సాయం అందజేశారు. ప్రవాస భారతీయులు వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతుల సౌజన్యంతో మహిళలకు ఆర్థిక సాయంతోపాటు ఫల సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు దీవి అనంతాచార్యులు, మురళీశర్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజు, సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత

గూడూరురూరల్: పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీ ఇంద్రసేనమ్మ దాతృత్వంతో సీ జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన దివ్యాంగుల చేయూత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దివ్యాంగులకు ఫలసరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కే సనత్‌కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, ప్రజేంద్ర రెడ్డి, సంఘం ప్రతినిధులు ఎం శ్రీనివాసులురెడ్డి, హరినాథ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సిద్దారెడ్డి, భాస్కర్ రెడ్డి, కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


లబ్ధిదారుకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేట మండలంలోని కొరిడి పంచాయతీలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యేకు స్థానికుల ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరించి, బుక్‌లెట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ పథకాలు అందేలా సమపాలన చేస్తున్నారని తెలిపారు. అర్హుందరికీ న్యాయం చేయాలన్న ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వివిధద సమస్యలను అక్కడే పరిష్కరిస్తున్నారని చెప్పారు. ప్రజలు జగనన్నసురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిఇని ఆశీర్వదించి, ముఖ్యమంత్రి చేయాలని కోరారు. పేదలకు న్యాయం జరగాలంటే తమ ప్రభత్వంతోనే సాధ్యమన్నారు. గత ప్రభుత్వం ప్రజలను సంక్షేమ పథకాల పేరుతో మోసం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జెట్టి వేణు, చిలకా యుగంధర్, కొరిడి సర్పంచ్ నిమ్మల గురువయ్య, మున్సిపల్ కౌన్సిలర్ రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు చిలక అరుణ తదితరులు పాల్గొన్నారు.

దారా రవికి ఎమ్మెల్యే పరామర్శ

నాయుడుపేటటౌన్: మున్సిపల్ కౌన్సిలర్ దారా రవి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదివారం పరామర్శించారు. రవి సోదరుడు దారా శ్రీనివాసులు(55) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పట్టణంలోని అగ్రహారపేటలోని రవి నివాసానికి వెళ్లి శ్రీనివాసులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్ కే దీపిక, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ టీ సుబ్రహ్మణ్యంరెడ్డి, బీ మల్లికార్జునరెడ్డి, కే జయరామయ్య, ఎన్‌సీఆర్, పీ చంద్రారెడ్డి తదితరులు రవిను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

ఆరోపణలు తగవు


మాట్లాడుతున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు వి మధునాయుడు

వెంకటగిరి: పట్టణంలోని కుమ్మరిగుంట అయ్యప్పస్వామి ఆలయ నిర్వహణలో అక్రమాలు జరుగుతున్నాయని కమిటీ గౌరవాధ్యక్షుడు సీహెచ్ వెంకట్రాయులు ఆరోపణలు చేయడం తగదని పాలక మండలి సభ్యులు అన్నారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ అధ్యక్షుడు వి మధునాయుడు, సభ్యులు ఓజిలి గుర్నాథం, శ్రీహరికోట కృష్ణయ్య తదితరులు మాట్లాడారు. సుబ్బరాయులు బేల్దారి మేస్త్రీగా ఆలయం నిర్మాణంలో పనిచేశారని, అంతే తప్ప ఆయన విరాళం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. వెంకటగిరికి చెందిన అయ్యప్పస్వామి భక్తులు, స్థానికుల విరాళాలతో ఆలయం నిర్మించామని, ఆలయం ఏ ఒక్కరి సొత్తు కాదన్నారు. భక్తుల మనోభావాలను కించపరిచేలా ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. అనంతరం ఆరోపణలు చేసిన వారిని కమిటీ నుంచితొలగిస్తున్నట్లు మిగిలిన సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కాగా అంతకుముందు ఆలయ గౌరవాధ్యక్షుడు సీహెచ్ సుబ్బరాయులు విలేకరులతో మాట్లాడుతూ అయ్యప్పస్వామి ఆలయ నిర్వహణలో అక్రమాలు జరుగుతున్నాయని, దేవాదాయశాఖ ఆధీనంలోకి తీసుకుని అయ్యప్పస్వామి ఆలయాన్ని పరిరక్షించాలన్నారు.

నెరవేరిన ‘శతాబ్దాల కల’

- చెంబడిపాళేనికి బీటీ రోడ్డు నిర్మాణం


గిరిజన కాలనీకి నూతనంగా నిర్మించిన నాణ్యమైన బీటీ రోడ్డు

పెళ్లకూరు: మండలంలోని చెంబడిపాళెం గిరిజన కాలనీకి బీటీ రోడ్డు నిర్మాణంతో వారి శతాబ్దాల కల నెరవేరింది. కాలనీకి స్వాతంత్ర్యం పూర్వం నుంచి కాలిబాటన నడిచి వెళ్లేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకం కింద రూ.1.24కోట్లతో బీటీరోడ్డు నిర్మించారు. దీంతో ఆ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెంబడిపాళెం గిరిజన కాలనీ నుంచి జాతీయ రహదారికి ఒక కిలోమీటర్లు దూరం ఉంది.
ఈ కాలనీకి కాలిబాట మాత్రమే ఉంది. ఆ బాటకిరువైపులా పొలాలు ఉండడంతో ఎన్నో ఏళ్లుగా ఇక్కడి ప్రజలు పలు కష్టాలు ఎదుర్కొన్నారు. వర్షాకాలంలో పొలాల్లోని వరద నీరు కాలిబాటపైకి చేరడం, వాహనాల రాకపోకలతో రోడ్డు అధ్వాన్నంగా మారి, ఇక్కడి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో టీడీపీ, కాంగ్రెస్ పాలనలో పలువురు పాలకులు మారినా గ్రామానికి రోడ్డు వసతి కలగలేదు. ప్రస్తుతం పీఎంజీఎస్‌వై నిధులతో జాతీయ రహదారి నుంచి గ్రామానికి కిలోమీటర్లు దూరం, 3.75 మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డు పనులు నిర్మిస్తున్నారు. దీంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.